క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్ యశ్వంత్

జి.సిగడాం: వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం పీహెచ్‌సీ వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో బోర్లు, చెరువులు అడుగంటి పోవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి నీటిని ఎవరూ తాగవద్దన్నారు. ఎండలో తిరవద్దన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శివచరణ్ ప్రతిభ


శివచరణ్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ మూడో ఏడాది చదువుతున్న విద్యార్థి ఎండ శివచరణ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటాడు. రజత పతకంతో మెరిశాడు. ఈ నెల 17, 18 తేదీల్లో చిత్తూరులో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు జరిగాయి. అండర్ -23 విభాగంలో 67 కేజీల గ్రీకోరోమన్ విభాగంలో శివచరణ్ రజత పతకం సాధించాడు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శివచరణ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ యండ శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ సభ్యులు పి.దుర్గాప్రసాద్ రాజు, పీడీ టి.బాలాజీ అభినందించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సంతోషిమాతకు విశేష పూజలు


పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమపూజలు, లలితా సహస్ర నామ పారాయణం, హోమం జరిపించారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి పందిరిరాట


పందిరిరాట ఉత్సవంలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగర పరిధిలోని సీపన్నాయుడుపేటలో శ్రీరామ మందిరం వార్షికోత్సవం సందర్భంగా జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి శుక్రవారం పందిరిరాట వేశారు. ఆలయ కమిటీ నేతృత్వంలో అర్చకులు బంకుపల్లి అప్పల నరసింహాశర్మ, సుధీర్ శర్మల ఆధ్వరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూజారి చక్రవర్తి, రోజా దంపతులు, అధికంగా భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రవికి కేంద్ర మంత్రి అభినందన


రవిని అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీలో) అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గేదెల రవి గౌహతి ఐఐటీలో డాక్టరేట్ పూర్తి చేశారు. సీతంపేట మండలం పెద్దపల్లంకివలస అనే గిరిజన గ్రామం నుంచి ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ పూర్తిచేశారు. పేదరికంతో పోరాడి ఉన్నత విద్య చదివిన ఈయనను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఖరీఫ్ గట్టెక్కేనా..?


ఎచ్చెర్ల మండలం నవభారత్ జంక్షన్ సమీపంలో సాగునీటి కాలువను కప్పేసిన పిచ్చిమొక్కలు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులకు ఖరీఫ్ గుబులు వెంటాడుతోంది. గత ఏడాది కళ్లముందే పంటలను కోల్పోయిన విషయాన్ని గుర్తు చేసుకొని ఆందోళన చెందుతున్నారు. ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం కుడికాలువ కింద 13 గ్రామ పంచాయతీలకు సాగునీరు అందుతుంది. గత ఏడాది ఖరీఫ్‌లో సాగునీరు అందక రైతులు ఐదు వేల ఎకరాల్లో పంటలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు సజావుగా సాగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు. ఎచ్చెర్ల మండలంలో 7,175 ఎకరాలు శివారు భూములు ఉన్నాయి. నారాయణపురం కుడికాలువ పరిధిలోని ఎచ్చెర్ల, పొందూరు, సంతకవిటి మండలాల పరిధిలో 18,365 ఎకరాలు సాగుభూమి ఉంది. ఆయకట్టు కింద భూమి అయినా వర్షాలు అనుకూలించకపోతే పంటలు కోల్పోయే పరిస్థితి ఉంది.

ఎచ్చెర్ల మండలంలో పరిస్థితి ఇలా..

ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట నుంచి ఓలేటి అగ్రహారం వరకు నారాయణపురం కాలువ విస్తరించి ఉంది. ఫరీదుపేట, ఇబ్రహింబాద్, తమ్మినాయుడుపేట, పూడివలస, కుశాలపురం, తోటపాలెం, పొన్నాడ, కొత్తపేట, కొంగరాం, ముద్దాడ, ధర్మవరం, భగీరథపురం, ఓలేటి అగ్రహారం తదితర 13 గ్రామ పంచాయతీల పరిధిలో కాలువ విస్తరించి ఉంది. శివారు భూములకు సాగునీరు అందించాలంటే అత్యవసర పనులు నిర్వహించాలి. నారాయణపురం కుడి కాలువ ద్వారా ఖరీఫ్‌లో సజావుగా సాగునీరు అందించేందుకు రూ. 34.63 లక్షలు మంజూరు చేశారు. అయితే ఎచ్చెర్ల మండల పరిధిలో మాత్రం ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

పేరుకుపోయిన పూడికలు..

కాలువలో చెట్లు, తూటిక తివ్వ వ్యాపించటం, మట్టి మేటలు పేరుకుపోయి ఉండటం, పిల్ల కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవటం, మదుములు, షట్టర్లు అస్తవ్యస్తంగా ఉండడం వంటి అనేక సమస్యలు ఉన్నాయి. జూన్ వచ్చిందంటే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనట్లే. అయితే కాలువల మరమ్మతులపై మాత్రం సంబంధిత అధికారులు దృష్టిసారించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకుంది. ప్రస్తుతం కాంక్రీట్ లైనింగ్ వంటి శాశ్వత పనులు సాధ్యం కావు. కనీసం తాత్కాలికంగా పనులు పూర్తి చేస్తే ఈసారి ఖరీఫ్ గట్టెక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు.

మండలం	సాగు భూమి ఎకరాల్లో
ఎచ్చెర్ల	7,175
పొందూరు	6,967
సంతకవిటి	4,221


కుశాలపురం పరిధిలో కాలువ పరిస్థితి

ఖరీఫ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి



అధికారులు ఖరీఫ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. నారాయణపురం కుడికాలువ కింద గత ఖరీఫ్‌లో రైతులు పంటలు కోల్పోయారు. ఈసారైనా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నాట్లు వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చేవరకు సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి.

– గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

వేలాది మంది రైతుల సమస్య



నారాయణపురం కాలువ ద్వారా సక్రమంగా సాగునీటిని అందించాలి. ఎచ్చెర్ల మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలో వేలాది మంది రైతుల సమస్య ఇది. అత్యవసర పనులు యంత్రాలతో నిర్వహించాలి. కాలువ ప్రారంభంలో నీరు వృథాకాకుండా చర్యలు తీసుకోవటం, శివారు భూములకు సక్రమంగా సారునీరు అందటం వంటి చర్యలు తీసుకోవాలి.

–బోర సాయిరాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల మండల అధ్యక్షుడు

సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నారాయణపురం కాలువ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మార్చి నుంచి జిల్లా ఫిర్యాదుల విభాగంలో వినతులు అందించాం. జలవనరుల శాఖ అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెవెళ్లాం. అధికారులు స్పందించి ఈ ఖరీఫ్‌లో సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– సనపల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

'కక్ష సాధింపులను సమర్థవంతంగా ఎదుర్కొందాం'


మాట్లాడుతున్న ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వ కక్ష సాధింపులను సమర్థ వంతంగా, న్యాయపరంగా ఎదుర్కొందామని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. కుశాలపురం బైపాస్ కూడలిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పెడుతున్న పోలీస్ కేసులు, స్థానిక సంస్థల పరిపాలనలో రాజకీయ జోక్యం, ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల తొలగింపు, సంక్షేమ పథకాల మంజూరులో వివక్షవంటి వాటిపై ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు పక్కన పెట్టి రాజకీయ కక్షలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని చెప్పారు. సమావేశంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు మాడుగుల మురళీధర్‌బాబా, నేతింటి నీలమప్పడు, నక్క కృష్ణమూర్తి, మూగి శ్రీరాములు, గవిరెడ్డి రవికుమార్, బోర గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి


కుంభా రవిబాబును సత్కరిస్తున్న ఎన్ని ధనుంజయ

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు కుంభా రవిబాబు అన్నారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ఆయన్ను పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఎన్ని ధనుంజయరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: విశాఖపట్నం జిల్లా సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గార మండలం వాడపాలెం గ్రామానికి చెందిన పి.గోవిందరావు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో అందజేశారు.

దేవస్థానం తరఫున దాతకు సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్ అందించారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

పల్లె రహదారులను.. పట్టించుకోరా?


దూసి నుంచి ప్రధాన గ్రామాలకు వెళ్లే రహదారి దుస్థితి

- గోతులమయంగా దూసి–గట్టుముడుపేట రోడ్డు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు
- పట్టించుకోని పాలకులు

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వం వస్తే రహదారి కష్టాలు తీర్చుతామని ఆర్భాటంగా ప్రకటించిన నాయకులు ఇప్పుడా సంగతే మర్చిపోయారు. పట్టణాల పరిధిలో కొన్నిచోట్ల మాత్రమే పనులు చేసి పల్లె రహదారులను పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో ఏడు గ్రామాలను కలిపే ప్రధాన రహదారి దూసి నుంచి అధ్వానంగా తయారైంది. దూసి, వంజంగి, బావాజీపేట, కొత్తపేట, కూటుకుప్పలవానిపేట, గట్టుముడుపేట గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు గతుకులమయంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ ప్రాంతంలో ఎప్పుడు పర్యటించినా త్వరలోనే రోడ్డు వేస్తామని ప్రకటించడం, తర్వాత ఆ సంగతి మర్చిపోవడం పరిపాటిగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా రోడ్డుకు మోక్షం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే ఏర్పడిన గొయ్యి

అడుగడుగునా గోతులే..



మా గ్రామానికి వచ్చిన నేతలంతా ప్రతీసారి 'చూద్దాం..చేద్దాం' అంటారే తప్ప కార్యరూపంలోకి తేవడం లేదు. వైఎస్ఆర్ హయాంలో వేసిన రోడ్డు ఇదీ. ఇప్పుడు ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రివేళల్లో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది.

– అప్పారావు, బావాజీపేట

వినతిపత్రాలు ఇచ్చినా..



మా గ్రామాన్ని ఆనుకొని ఏడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇది. ఎంతో మందికి వినతి పత్రాలు ఇచ్చాం. చేస్తామంటున్నారే తప్ప ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. చాలా గ్రామాలుకు వెళ్లేందుకు ఇదే రోడ్డు ఆధారం. ఎక్కడికక్కడే గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలి.

– శేఖర్, కూటుకుప్పలవానిపేట

యోగాతో మానసిక ఉల్లాసం



మానసిక ఉల్లాసానికి యోగా దోహదపడుతోందని తహసీల్దార్ ఎం.సరిత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వివిధ శాఖల సిబ్బందితో యోగా నిర్వహించారు. రోజూ గంటసేపు యోగా చేస్తే వ్యాధులు దరిచేరవన్నారు. రామకృష్ణ యోగా చైతన్యధార్మిక సంస్థ గురువులు మీసాల రామకృష్ణ, డీటీలు ఎస్.నిర్మల, కె.గాయిత్రి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

–జి.సిగడాం

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేటలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. గాలులకు తీగలు ఊగుతుండంతో రైతులు భయ పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

వైభవంగా వేంకటేశ్వరాలయ వార్షికోత్సవ పూజలు


మొండేటివీధిలో వేంకటేశ్వరుడికి అభిషేకాలు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవం పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీవాస శర్మ ఆధ్వరంలో స్వామివారి నిజరూప దర్శనం అనంతరం క్షీరాభిషేకాలు జరిగాయి. సుప్రభాతసేవ, అష్టోత్తరశత నామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు చేశారు. సాయంత్రం కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు శ్రీవాస శర్మ, దిలీప్‌శర్మల ఆధ్వరంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

- గంటసేపు ప్రయాణికుల నరకయాతన


వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

జి.సిగడాం: రాజాం–శ్రీకాకళం ప్రధాన రహదారిలో జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామ సమీపం వంతెనపై శుక్రవారం సాయంత్రం సుమారు గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. వంతెనపై ట్రాక్టర్, బస్సులను నిలిపి వేశారు. దీంతో వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రాజాం,శ్రీకాకుళం నుంచి వచ్చిన వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుకున్న స్థానిక ఎస్ఐ వై మధుసూదనరావు సిబ్బందితో చేరుకొని వాహనాలను క్రమబద్ధీకరించడంతో సమస్య పరిష్కారమైంది. సుమారు గంటసేపు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇక్కడ ఉన్న రాజరాజేశ్వరీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు బాలభాస్కరశర్మ ఆధ్యర్యంలో పూజలు చేశారు. శ్రీచక్రాల వద్ద మహిళలు కుంకుమార్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సందేశాత్మక చిత్రం 'రోమియో'

శ్రీకాకుళం అర్బన్: 'రోమియో' మంచి సందేశాత్మక చిత్రంగా నిలుస్తుందని, ముఖ్యంగా యువతను హత్తుకునేలా ఉంటుందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళంలోని పీఎస్ కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో రోమియో చిత్రం ముహూర్తపు సన్నివేశాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి ఎంతోమంది ఉత్తమ కళాకారులున్నారని, ఈ చిత్రం ద్వారా జిల్లాకు చెందిన మరికొంతమంది ప్రతిభను బయట ప్రపంచానికి తెలియజేయటం హర్షణీయమన్నారు. రోమియో చిత్రం మంచి విజయం సాధించి మన కళాకారులకు, చిత్ర దర్శక, నిర్మాతలకు, నటీనటులకు, చిత్ర యూనిట్ సభ్యులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్ర హీరో, కెమెరామాన్, డైరెక్టర్ తేజ్ మహేంద్ర, డైరెక్టర్ ప్రేమ్ సుప్రీమ్, డైరెక్టర్ తారక్, సీనియర్ నటులు రమేష్ నారాయణ్, అగ్గున బాబూరావు, రమణ మణిగాము, సాయి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొడుతున్న జగన్మోహనరావు